# తెలుగేతరులకు తెలుగు భాషాబోధన

(Teaching Telugu to non-Telugu students)

హెప్సీబ సుంకరి

తెలుగు సాహిత్యాభిమానుల కృషి, సహాయసహకారాలతో బర్క్లీలో 2007 ఆగస్టులో ప్రారంభమైన తెలుగు భాషాబోధన ఇంతవరకు చాలా చక్కగా కొనసాగుతుంది. ఇప్పటివరకు 27 మంది తెలుగు వారు, తెలుగేతరులు తెలుగు నేర్చుకొన్నారు, ప్రస్తుతం ఐదుగురు నేర్చుకొంటున్నారు.

అమెరికన్ భాషా బోధన పరిభాషలో విదేశీ మాతృభాషా వ్యవహర్తల్ని heritage students, ఆంగ్లభాషా వ్యవహర్తల్ని non-heritage students అని అంటారు. Heritage students అంటే మాతృభాషా వారసత్వం కలిగినవారు అని అర్థం. వీరిలో కూడ భిన్న భాషా స్థాయిల వారున్నారు. కొంతమందికి మాట్లాడడం తెలుసు కాని, చదవడం, రాయడం తెలియని వారు. వాళ్లకు మాట్లాడడం కొంతవరకు తెలిసినా, వాళ్ళకున్న పదజాల పరిజ్ఞానం చాలా పరిమితం.  కొంతమంది, కేవలం ఇది తెలుగు భాష అని మాత్రమే గుర్తించగలరు. అంతకు మించి ఏమీ తెలియదువాళ్ళకు. ఇక తెలుగేతరుల్లో కొందరు సింధి, కన్నడ భాషా నేపథ్యాల్నుండి వచ్చి నవారు. తక్కినవారు అమెరికన్లు. ఇలా భిన్న భాషా నేపథ్యాల్నుండి వచ్చిన వారికి తెలుగు నేర్పించడం అంత సులువైన విషయం కాదు.

తెలుగు క్లాసు ప్రారంభమైన మొదటిరోజే విద్యార్థులందరిని, వాళ్ళ భాషా నేపథ్యమేమిటి? తెలుగు ఎందుకు నేర్చుకోవాలనుకొంటున్నారు? అని అడుగుతాను. విద్యార్థులు రకకాల కారణాల వల్ల నేర్చుకొంటామంటారు. కొంతమంది సంభాషణా మెలకువల్ని మెరుగుపరచుకోడానికంటే, మరికొందరు చదవడం, రాయడం నేర్చుకొంటానికంటారు. కొద్దిమంది మాత్రం సాహిత్యం చదవడానికంటారు.

కాబట్టి ఇలా భిన్న భాషా నేపథ్యాలు, భిన్న భాషా స్థాయిలు, భిన్న భాషాధ్యయన ఉద్దేశాల్ని దృష్టిలో ఉంచుకొని పాఠ్య ప్రణాళికను తయారుచేసుకోవాల్సి వస్తుంది.

తెలుగు భాషా బోధనలో ప్రధానంగా రెండు సమస్యలుఎదురయ్యాయి. మొదటిది నేర్పించడానికి సరియైన భాషోపకరణాలు అందుబాటులో లేకపోవడం, రెండోది తెలుగేతరులకు తెలుగు బోధించేటప్పుడు  వచ్చే సమస్యలు.

నేడు ప్రపంచీకరణ మూలంగా అంతర్జాతీయంగా భాషాధ్యయనం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకొంది. దానిలో భాగంగానే భాషోపకరణాలు, బోధనాసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకొంటూ ఇంగ్లీష్, ఫ్రెంచి, జపనీస్, రష్యన్, స్పానిష్, ఇలా అనేక భాషలు ఆడియో వీడియో పాఠాలు, అంతర్జాల బోధనోపకరణాలు సమకూర్చుకొన్నాయి. వీటికి సంభాషణాత్మక భాష, వ్యాకరణం, ఇలా రకరకాల పాఠ్య ప్రణాళికలు, వాటికనుగుణమైన సాధనసంపత్తి అందుబాటులో ఉన్నాయి. అయితే మన కు తెలుగులో అందుబాటులో ఉన్న వ్యాకరణ గ్రంథాలు పరిమితం. గతంలో వచ్చిన ముఖ్య గ్రంథాలలో పేర్కోదగినవి చిన్నయ సూరి బాలవ్యాకరణం, సి. పి. బ్రౌన్ వ్యాకరణ పుస్తకం, మిషనరీ ఎ.హెచ్. ఆర్డెన్ వ్రాసిన "A progresseve grammar to Telugu language"లు. ఆధునిక తెలుగు భాషాబోధనకు అనుగుణంగా వచ్చినవాటిలో భద్రిరాజుక్రిష్ణమూర్తి గారి "A basic course in modern Telugu ", CIIL వారు ప్రచురించిన పరిమి రామ నరసిం హం గారి “An Intensive course in Telugu”, ఆచార్య వెల్చేరు గారి అముద్రిత వ్యాకరణ పుస్తకం.

ఇప్పటి వరకు మనకు అందుబాటులో ఉన్న గ్రంథాలు సమగ్రం కాదనే చెప్పాలి. ఇతర భాషల వలె మన విద్యార్థులకు ఒక ప్రణాళికాబద్ధమైన వ్యాకరణ పాఠ్య పుస్తకం ఉండాలి. ఆ కొరతచాలా ఉంది. ఇకపోతే పాఠ్య ప్రణాళికను సిద్ధం చేసుకొనేటప్పుడు నేను ఎంచుకొన్న మార్గాలేమిటంటే, 1. Setting goals లక్ష్యాలు నిర్దేశించుకోవడం, 2. Selecting teaching methods బోధనాపద్ధతుల్ని ఎంచుకోవడం, 3. Teaching Telugu culture through language at elementary level భాషాబోధన ద్వారా తెలుగు సంస్కృతిని పరిచయం చేయడం.

1. Goals ఏమిటంటే సంవత్సరాంతానికి చదవడం, వ్రాయడం, తప్పుల్లేకుండా మాట్లాడ్డం నేర్పించాలి.
2. Teaching methods: బోధనా పద్ధతులు. విద్యార్థుల back ground ని బట్టి బోధనా పద్ధతుల్ని ఎంచుకోవటం జరిగింది.
   పాఠ్యప్రణాళిక పద్ధతుల్లో నిర్మాణాత్మక, ప్రయోగాత్మక, సంభాషణాత్మక పద్ధతులని చాలా రకాలున్నాయి. ఎక్కువగా నిర్మాణాత్మక పద్ధతిని అవలంబించడం జరుగుతుంది. విద్యార్థుల అవసరతను బట్టి ఇతర పద్ధతులను జోడించి తెలుగు బోధించడం జరుగుతుంది. ఎక్కువగా నిర్మాణాత్మక పద్ధతిని అవలంబించడం జరుగుతుంది.

3. Teaching culture through language. ప్రస్తుతం మనకున్నది ఒక్క కోర్సు మాత్రమే. అది ప్రాథమిక స్థాయి. ప్రాథమిక స్థాయిలో సంస్కృతిని బోధించే అవకాశాలు తక్కువ. కాని భాషాబోధనలోని ప్రతి సందర్భాన్ని వినియోగించుకొంటూ తెలుగు సంస్కృతిని పరిచయం చేయటం జరుగుతుంది.

ఉదా. సర్వనామాలు బోధించేటప్పుడు, మా, మన అనేవాటిని ఎలా ఉపయోగిస్తాం? నా ఇల్లు, నా ఊరు అనం. ఎందుకంటే మనది ఉమ్మడి సమాజం.(Pluralistic society). అలాగే బంధువాచకాల్ని గురించి చెప్పేటప్పుడు బంధువాచకాల్ని మన బంధువులకే కాకుండా, స్నేహితులు, ఇరుగుపొరుగు వారికి కూడా వాడతాం. ఎందుకంటే పెద్ద వాళ్ళని పేరుపెట్టి పిలిచే సంస్కృతి మననకు లేదు. అలాగే మరో ఉదాహరణ, స్త్రీలింగం ఏకవచనానికి, నపుంసక లింగం ఏకవచనానికి తెలుగులో భేదం ఉండదు. రెంటిని అది అని సంబోధిస్తాం. ఇలాగే పదజాలంలో కూడా సంస్కృతిని గూర్చి నేర్చుకొనే సందర్భాలు క్లాసులో చర్చించడం జరుగుతుంది. ఇలాంటి విషయాల్ని పరిశీలించినప్పుడు భాష సంస్కృతిని ఎలా ప్రతిబింబిస్తుందో నేర్చుకోవచ్చు. వీటితో పాటు ఆయా పండుగల గురించి, జనజీవన విధానం గురించి (పదజాలం నేర్చుకొనే సందర్భంలో), ఆయా కవుల గురించి నేర్పించడం జరుగుతుంది. భాషతో పాటు సంస్కృతిని నేర్చుకోవడానికి విద్యార్థులు కూడ చాల ఆసక్తి కనుపరుస్తారు.

ముందు పేర్కొన్నట్లుగా తెలుగేతరులకు తెలుగునేర్పించడానికి తగిన పాఠ్య పుస్తకాలు లేకపోవడం సమస్య.

ఇక తెలుగేతరులకి బోధించేటప్పుడెదురయ్యే ప్రధాన సమస్యలు

ధ్వని ఉచ్చారణాదుల్లో సమస్య. ఇక్కడి తెలుగు విద్యార్థులకు, ముఖ్యంగా అమెరికన్లకు త-ట, ద-డ ల భేదం తెలియదు. ఆంగ్లంలో retroflex మూర్ధన్య స్వరాలు లేకపోవడం వలన ఆ సమస్య ఎదురవుతుంది.

వాక్య నిర్మాణ క్రమంలో ఎదురయ్యే సమస్య. ఇంగ్లీషులో sentence structure వేరుగా ఉండటం వల్ల తెలుగులో కొంచెం కష్టపడతారు.

తెలుగు సంస్కృతిని తెలుగు వాళ్ళు కొంతవరకు అర్థం చేసుకోగలరు కాని అమెరికన్లకు అది పూర్తిగా క్రొత్త. అందుకే వాళ్ళు చాలా ఆసక్తి కనుపరుస్తారు.

ప్రతి క్లాసు రెండు గంటలు ఉంటుంది. కొంత పాఠం, కొంత సేపు  పఠనాభ్యాసం, సంభాషణ, ఇలా ఉంటుంది. ప్రతివారం, quizzes, home work ఉంటుంది. కొన్ని క్లాసుల్లో శ్రవ్య పాఠాలు వింటారు.

## Reading practices:

ప్రతి సెమెస్టరులో ఒకరోజు guest lecture కి కేటాయించడం జరుగుతుంది. ఇప్పటివరకు, పేరి భాస్కర రావు గారు, వేమూరి రావు గారు, ఆవుల మంజులతగార్లు వచ్చి ఆయా అంశాల మీద ఉపన్యసించారు.

ఇప్పటి వరకు చాలమటుకు అనుకొన్న లక్ష్యాలు సాధించామనే చెప్పవచ్చు. తెలుగు ఏ మాత్రం పరిచయం లేని విద్యార్థులు అక్షరాలతో మొదలుపెట్టి స్వంతగా ఒకటిన్నర సెమెస్టర్ల లోపే చదవడం, రాయడం, నేర్చుకొన్నారు, మాట్లాడగల్గుతున్నారుకూడ. వాళ్ళను చూస్తే నాకు చాలా సంతృప్తికరంగా, ఆనందంగా ఉంటుంది.